Digital, tmedia.net.in

# టీ-మీడియా

tmedia.net.in

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక :336
పేజీలు :3

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

ఆదివారం 19/07/2026 టీమీడియా మెయిన్ ఎడిషన్ ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

# స్కైరూట్ విజయం.. దేశయువతకు స్ఫూర్తి



**⏭ ప్రధాని నరేంద్ర మోదీ**

**టీ మీడియా, జులై 18 ,న్యూఢిల్లీ:**
భారతదేశపు మొట్టమొదటి ప్రైవేట్ ఆర్బిటాల్-క్లాస్ రాకెట్ 'విక్రమ్-1 శనివారం నాడు శ్రీహరికోట అంతరిక్ష కేంద్రం నుండి నింగిలోకి దూసుకెళ్లింది. విక్రమ్ -1 ప్రయోగం విజయవంతం పట్ల ప్రధాని నరేంద్ర మోదీఅభినందనలు తెలిపారు. శాస్త్రవేత్తలతో మోదీ ఫోన్ లో మాట్లాడారు. స్కైరూట్ విజయం.. దేశ యువతకు స్ఫూర్తినిస్తోందని పేర్కొన్నారు.విక్రమ్-1 ప్రయోగాన్ని తాను కూడా వీక్షించినట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. ఏళ్ల తరబడి స్కైరూట్ కృషికి ఫలితమే ఈ విజయమని ప్రధాని కొనియాడారు. అంతరిక్షంలో ప్రైవేటు రంగం ఆహ్వానంపై మొదట్లో సందేహాలొచ్చాయని సూచించారు. ప్రైవేటు సంస్థలు విజయం సాధించలేవని కొంతమంది అన్నారని స్పష్టం చేశారు. ప్రైవేటు రంగంపై ఉన్న సందేహాలను మీరు పటాపంచలు చేశారని చెప్పారు. త్వరలోనే స్కైరూట్ బృందాన్ని కలుస్తానని ప్రధాని వెల్లడించారు.




# 'విక్రమ్-1' ప్రయోగం గ్రాండ్ సక్సెస్

## సరికొత్త రికార్డు సృష్టించిన భారత తొలి ప్రైవేట్ రాకెట్!

**టీ మీడియా, జులై 18 , ఢిల్లీ బ్యూరో :**
నింగికెగిరిన భారత తొలి ప్రైవేట్ రాకెట్. అంతరిక్షంలో కొత్త యుగానికి శ్రీకారం. దేశపు తొలి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్ 'విక్రమ్-1' శనివారం ఉదయం 12.06 గంటలకు శ్రీహరికోట నుంచి విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లింది. హైదరాబాద్‌కు చెందిన "స్కైరూట్ ఏరోస్పేస్" దీనిని రూపొందించింది. 'మిషన్ ఆగమన్' పేరుతో చేపట్టిన ఈ చారిత్రాత్మక ప్రయోగం విజయవంతం కావడంతో ప్రైవేట్ కంపెనీలకు కొత్త ద్వారాలు తెరుచుకున్నాయి.ఈ చారిత్రాత్మక క్షణానికి సాక్షిగా ఏపీ మంత్రి నారా లోకేశ్ శ్రీహరికోటలోని లాంఛ్ కంట్రోల్ సెంటర్‌కు హాజరయ్యారు. అలాగే లాంఛ్ వ్యూయింగ్ గ్యాలరీకి వందలాది మంది పాఠశాల విద్యార్థులు, యువత తరలివచ్చి రాకెట్ ప్రయోగాన్ని ఉత్సాహంగా తిలకించారు.

**సమయం మారినా.. పక్కాగా సెపరేషన్**

నావిగేషన్ సమస్యల వల్ల ప్రయోగం ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 12:05 గంటలకు వాయిదా పడింది. అయితే, ఆలస్యంగా ప్రారంభమైనా.. నింగిలోకి దూసుకెళ్లిన కొద్ది నిమిషాల్లోనే అత్యంత కీలకమైన మూడో దశ అనుకున్న టైమ్‌లైన్ ప్రకారమే విజయవంతంగా విడిపోయింది.

**భూమి దృశ్యాలు ప్రత్యక్షం**

ఈ ప్రయాణంలో రాకెట్‌కు అమర్చిన హై-రిజల్యూషన్ కెమెరాల ద్వారా అంతరిక్షం నుంచి మన భూమికి సంబంధించిన అద్భుతమైన లైవ్ దృశ్యాలు కనిపించాయి. గగనతలం నుంచి నీలిరంగులో మెరుస్తున్న భూగోళం తాలూకు విజువల్స్ స్క్రీన్‌లపై ప్రత్యక్షమవ్వగానే లాంఛ్ కంట్రోల్ సెంటర్‌లోని శాస్త్రవేత్తలు, గ్యాలరీలోని విద్యార్థులు ఆనందంతో కేరింతలు కొట్టారు.

**లాస్ట్ స్టేజ్ కూడా నామినల్**

రాకెట్ ప్రయాణంలో అత్యంత కీలకమైన చివరి, నాలుగో దశ పనితీరు కూడా అద్భుతంగా, అనుకున్న రీతిలోనే సాగింది. త్రీ డి -ప్రింటెడ్ టెక్నాలజీతో రూపొందించిన 'రామన్' ఇంజిన్లు పక్కాగా పనిచేసి, రాకెట్‌ను లక్ష్యం వైపు నడిపించాయి.

**నాలుగో దశ ఇంజన్ కటాఫ్**

నాలుగో దశ ప్రయాణం ముగియగానే, ప్లాన్ ప్రకారం 'రామన్' ఇంజన్లు విజయవంతంగా ఆగిపోయాయి (కటాఫ్ అయ్యాయి) . ఇంజిన్ కటాఫ్ ప్రక్రియ పక్కాగా జరగడంతో రాకెట్ తన లక్ష్యాన్ని వంద శాతం చేరుకుంది. శాటిలైట్లు విజయవంతంగా విడిపోయాయి ఇంజిన్ ఆగిపోయిన వెంటనే, రాకెట్ మోసుకెళ్లిన ఉపగ్రహాలన్నీ (శాటిలైట్లు) ఒకదాని తర్వాత ఒకటి విజయవంతంగా విడిపోయి (సెపరేట్ అయి) అంతరిక్షంలోకి ప్రవేశించాయి.
అంతరిక్ష వ్యర్థాలను తొలగించే రోబోటిక్ హ్యాండ్ సహా అన్ని పేలోడ్స్‌ను నిర్దేశిత కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టింది.
మిషన్ గ్రాండ్ సక్సెస్- అధికారిక ప్రకటన రాకెట్ ప్రయాణం విజయవంతంగా ముగిసి, ఉపగ్రహాలన్నీ కక్ష్యలోకి చేరిన వెంటనే.. స్కైరూట్, ఇస్రో శాస్త్రవేత్తలు 'విక్రమ్-1' ప్రయోగం "గ్రాండ్ సక్సెస్" అయిందని అధికారికంగా ప్రకటించారు. ఈ అద్భుతమైన చివరి అప్‌డేట్స్‌తో విక్రమ్-1 మిషన్ పూర్తి స్థాయిలో ఘన విజయం సాధించి, ప్రపంచ అంతరిక్ష యవనికపై భారత ప్రైవేట్ రంగానికి సరికొత్త గుర్తింపు తెచ్చింది.
ప్రధాని మోదీతో ఫోన్ సంభాషణ- కాలర్ ట్యూన్‌గా 'వందేమాతరం': ప్రయోగం గ్రాండ్ సక్సెస్ అని అధికారికంగా ప్రకటించిన వెంటనే, శ్రీహరికోట నుంచి శాస్త్రవేత్తల బృందం ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఫోన్ చేసి ఈ విజయవంతమైన వివరాలను పంచుకుంది.



# తొలిఏడాదే 70 వేల ఉద్యోగాలు ఇచ్చాం

**⏭ సీఎం రేవంత్ రెడ్డి**

**⏭ ఘట్‌కేసర్‌లో అందెశ్రీ స్మృతి వనానికి శంకుస్థాపన**

**టీ మీడియా, జులై 18 , ఘట్‌కేసర్ :**
మేకతోలు కప్పుకున్న తోడేలు ఇవాళ బయటికొచ్చిందని, మాజీ సీఎం కేసీఆర్ నోటిఫికేషన్లు ఇస్తే, ఈ ప్రభుత్వం ఉద్యోగాలిచ్చిందని చెబుతున్నారని కేటీఆర్‌ను ఉద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఉద్యోగ నియామకాల గురించి ఒక్కరోజైనా బీఆర్ఎస్ పాలకులు ఆలోచించారా అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. నిరుద్యోగులను ఎప్పుడైనా మనుషులుగా చూశారా అని నిలదీశారు. 16 ఏళ్ల తర్వాత తాము అధికారంలోకి వచ్చాక, గ్రూప్-1 నిర్వహించామని, బీఆర్ఎస్ పాలనలో ఎందరో నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన తొలిఏడాదే దాదాపు 70 వేల ఉద్యోగాలు ఇచ్చామని, తల్లిదండ్రుల సాక్షిగా 70 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలిచ్చామని సీఎం వెల్లడించారు.అందెశ్రీ తనకు ఆత్మ బంధువన్న సీఎం రేవంత్ రెడ్డి, అందెశ్రీ జయంతి సందర్భంగా ఆయన స్మృతి వనానికి శంకుస్థాపన చేశామని తెలిపారు. తెలంగాణ సమాజానికి ప్రముఖ కవిగా, గాయకుడిగా అందెశ్రీ సుపరిచితులని, అందెశ్రీ జయంతి కార్యక్రమానికి వారి కుటుంబసభ్యులను ఆహ్వానించామని అన్నారు. శంకుస్థాపన కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ పాల్గొన్నారు. అందెశ్రీ సమాధి వద్ద సీఎం, మంత్రులు నివాళులర్పించారు.

**అందెశ్రీని ఆనాటి ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది**

అందెశ్రీ తెలంగాణ ఉద్యమకారుడిగా అందరికీ పరిచయమని, అందెశ్రీని తన కుటుంబసభ్యుడిగా, పెద్దన్నగా భావించానని సీఎం తెలిపారు. గడీల ముందు మోకరిల్లనని ధైర్యంగా చెప్పిన కవి అందెశ్రీ అని కొనియాడారు. అందెశ్రీ, గద్దరన్న లాంటి వారితో పెట్టుకున్న వారు కాలగర్భంలో కలిసిపోయారని, అందెశ్రీ, గద్దర్‌ను అవమానించినప్పుడే దొరలను సాగనంపాలని జనం నిర్ణయించుకున్నారని అన్నారు. అందెశ్రీని ఆనాటి ప్రభుత్వం ఎంతో నిర్లక్ష్యం చేసిందని, గద్దర్‌ను కూడా ప్రగతిభవన్ గేటు ముందు ఎర్రటి ఎండలో నిలబెట్టారని విమర్శించారు.

**ఆ కుటుంబాలను ఆదుకున్నాం**

తెలంగాణ సాధనకు ఎందరో ప్రాణత్యాగాలు చేశారని గుర్తు చేశారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో ఆ దొరలకు కనీసం చిన్న గీతైన పడిందా ప్రాణత్యాగం చేసి తెలంగాణను తెచ్చిన వారి కుటుంబాలను ఆదుకున్నావా అని నిలదీశారు. ఎందరు ఉద్యమకారులను గౌరవించామో లెక్క తీయలాని కోరారు. విప్లవాలకు అంకితం చేసిన 9 కుటుంబాలను గుర్తించి వారిని ఆదుకున్నామని హామీ ఇచ్చారు.



# అమ్మాయి అనగానే ఆగిపోతున్నారు



**⏭ కడుపులో ఉండగానే కడతేర్చుతున్నారు**

**టీ మీడియా, జులై 18 , హైదరాబాద్ బ్యూరో :**
జనరేషన్లు మారుతున్నాయి. చదువు, చేసే ఉద్యోగాలూ మారుతున్నాయి. కానీ కొన్ని విషయాల్లో మాత్రం ప్రజల ఆలోచన ధోరణి ఇంకా మారడం లేదు. ఆడ పిల్లలపై వివక్ష ఇంకా తగ్గడం లేదు. ఖమ్మం జిల్లాలో ఆడబిడ్డల సంఖ్య నానాటికీ తగ్గిపోతోంది. 2021 నుంచి 2026 వరకు నమోదైన జననాల గణాంకాలను పరిశీలించినట్లయితే బాలికల సంఖ్య పెరుగుతుంది. కానీ బాలురతో పోలిస్తే మాత్రం వారి నిష్పత్తి పడిపోతుండటం ఆందోళన కలిగిస్తోంది.

**యంత్రాల దుర్వినియోగం**

ప్రస్తుత సాంకేతికతతో లింగ నిర్ధారణ పరీక్షలను సులభంగా చేసుకోవడానికి అల్ట్రాసౌండ్ స్కానింగ్, పోర్టబుల్ స్కానింగ్ పరికరాలతో శిశువు ఆరోగ్యాన్ని తెలుసుకోవడానికి వినియోగించాల్సిన యంత్రాలను దుర్వినియోగం చేస్తున్నారు. వీటితో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. గతేడాది జిల్లాలోని చింతకాని మండలంలో ఒక వ్యక్తి పోర్టబుల్ యంత్రాన్ని వినియోగించి పరీక్షలు చేసి, అబార్షన్లు చేస్తున్నాడనే సమాచారంతో పోలీసులకు పట్టుబడ్డాడు. ఖమ్మం నగరంలోని ఓ ఆసుపత్రిలో భ్రూణ హత్యలకు పాల్పడినట్లు అధికారుల తనిఖీల్లో తెలిసింది.

**ఈ తేడా సామాజిక అసమతుల్యకు దారితీస్తుంది**

2021లో రోజుకు 26 మంది బాలురకు 25 మంది బాలికలు పుట్టారు. 2026లోని జూన్ వరకు సగటున 34 మంది మగ, 30 మంది ఆడపిల్లలు జన్మించినట్లు సమాచారం. 2021లో ప్రతి వెయ్యి మంది బాలల్లో 973 మంది బాలికలు జన్మించారు. 2025లో ఆడపిల్లల సంఖ్య 909కి చేరింది. ఈ పరిణామం వల్ల భవిష్యత్తులో తీవ్రమైన సామాజిక అసమతుల్యత ఏర్పడే ప్రమాదం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

**ఈ పరిస్థితులకు కారణమేంటి?**

అమ్మాయిల సంఖ్య తగ్గిపోవడానికి చాలా కారణాలున్నాయి. తల్లిదండ్రులకు భద్రతాపరమైన ఆందోళనలు, వారసత్వం, అఘాయిత్యాలు, ఆడపిల్లలు భారమనే భావన ఎక్కువగా ఉండటం ఇందుకు కారణాలు. ఆడపిల్లలపై ఉన్న ఈ వివక్షతను పోగొట్టడానికి ప్రభుత్వాలు మరిన్ని పథకాలు తీసుకురావాలి. వాటితో పాటుగా విద్యా వ్యవస్థలోనూ మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఎంతగానో ఉంది. ప్రస్తుతం అమ్మాయిలు, మహిళల అభివృద్ధి కోసం 'బేటీ బచావో - బేటి పడావో', సుకన్య సమృద్ధి యోజన, ఉచిత బస్సు ప్రయాణం తదితర పథకాలు అమలులో ఉన్నాయి.

**తగ్గిపోతున్న స్త్రీ, లింగ నిష్పత్తి**

ప్రస్తుత సమాజంలో ఆర్థిక పరిస్థితుల కారణంగా కుమారుడిని ఆస్తిగా, కుమార్తెను బాధ్యతగా భావిస్తున్నారు. అందువల్ల లింగ నిర్ధారణ పరీక్ష చేయించి పుట్టబోయేది ఆడపిల్ల అని తెలిస్తే చాలు గర్భస్రావం చేయించుకుంటున్నారు. ఇలా భ్రూణహత్యలు పెరిగిపోవడం ఆందోళన రేకెత్తిస్తోంది. 2011 జనాభా లెక్కల ప్రకారం వెయ్యి మంది పురుషులకు 934 మంది స్త్రీలు ఉన్నట్లు ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి.

# ఆరోగ్య పరిస్థితి అత్యంత విషమం

**⏭ వాంగ్‌చుక్‌ను ఆసుపత్రికి తరలించిన పోలీసులు**

**టీ మీడియా, జులై 18 , ఢిల్లీ బ్యూరో :**
ప్రముఖ పర్యావరణవేత్త, విద్యావేత్త సోనమ్ వాంగ్‌చుక్‌ను ఢిల్లీ పోలీసులు శనివారం భారీ భద్రత మధ్య ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. జంతర్‌మంతర్ వద్ద గత 20 రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న ఆయన ఆరోగ్య పరిస్థితి అత్యంత విషమంగా మారడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. జూలై 20న పార్లమెంట్‌కు చేపట్టనున్న ర్యాలీకి రెండు రోజుల ముందు ఈ పరిణామం చోటుచేసుకుంది.ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు, వైద్య నిపుణుల సూచనల మేరకు వాంగ్‌చుక్‌కు అత్యవసర వైద్య చికిత్స అందించేందుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఢిల్లీ పోలీసులు వెల్లడించారు. నిరాహార దీక్ష కొనసాగుతుండటంతో ఆయన ఆరోగ్య పరిస్థితి వేగంగా క్షీణిస్తోందని వైద్యులు నివేదించిన నేపథ్యంలో అధికారులు ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

**ఉద్రిక్త పరిస్థితులు**

వాంగ్‌చుక్‌ను ఆసుపత్రికి తరలించే సమయంలో అక్కడ ఉన్న నిరసనకారులు పోలీసులను అడ్డుకునేందుకు ప్రయత్నించడంతో కొద్దిసేపు స్వల్ప గందరగోళం నెలకొంది. అయితే పోలీసులు సంయమనంతో వ్యవహరిస్తూ ఆయనను సురక్షితంగా ఆసుపత్రికి తరలించారు. అనంతరం జంతర్‌మంతర్ వద్ద ఉన్న నిరసనకారులు శాంతియుతంగా ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయాలని సూచించారు. భద్రతా కారణాల దృష్ట్యా కీలక ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటు చేసి అదనపు పోలీసు బలగాలను మోహరించారు.

**వాంగ్‌చుక్‌కు ప్రతిపక్ష నేతల మద్దతు**

శుక్రవారం పలువురు ప్రతిపక్ష నాయకులు జంతర్‌మంతర్‌కు వెళ్లి వాంగ్‌చుక్‌ను కలిసి సంఘీభావం ప్రకటించారు. ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్, ఎన్సీపీ (శరద్ పవార్ వర్గం) ఎంపీ సుప్రియా సూలే, సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ డింపుల్ యాదవ్, కాంగ్రెస్ నేత పవన్ ఖేరా, శివసేన (యూబీటీ) నేత ఆదిత్య ఠాక్రే తదితరులు ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

**కేంద్రంపై ప్రతిపక్ష విమర్శలు**

వాంగ్‌చుక్ దీక్ష విషయంలో కేంద్ర ప్రభుత్వం



స్పందించిన తీరు పట్ల ప్రతిపక్ష పార్టీలు విమర్శలు గుప్పించాయి. శివసేన (యూబీటీ) నాయకుడు ఆదిత్య ఠాక్రే, సుదీర్ఘకాలంగా నిరాహార దీక్ష చేస్తున్నప్పటికీ ప్రభుత్వం ఆయన డిమాండ్లను పట్టించుకోలేదని ఆరోపించారు. మరోవైపు ఏఐఎంఐఎం జాతీయ ప్రతినిధి వారిస్ పఠాన్, వాంగ్‌చుక్‌తో ప్రభుత్వం చర్చలు జరిపి సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. విద్యార్థులు, తల్లిదండ్రులు కూడా ఆయన ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

**నీట్ లీకేజీ వ్యవహారంపై నిరసన**

దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన నీట్ పరీక్ష పేపర్ లీకేజీ, విద్యా వ్యవస్థలో అవకతవకలకు వ్యతిరేకంగా 'కాక్రోచ్ జనతా పార్టీ' ఆధ్వర్యంలో జరుగుతున్న ఉద్యమానికి మద్దతుగా సోనమ్ వాంగ్‌చుక్ జూన్ 28న ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించారు. విద్యా వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఆయనతో పాటు నిరసనకారులు డిమాండ్ చేస్తున్నారు.

**20 రోజుల్లో 9 కిలోల బరువు**

గత 20 రోజులుగా కేవలం నీరు మాత్రమే తీసుకుంటూ దీక్ష కొనసాగిస్తున్న వాంగ్‌చుక్ దాదాపు 9 కిలోల బరువు కోల్పోయినట్లు వైద్యులు తెలిపారు. శరీరంలో కొవ్వు, కండరాలు కరిగిపోవడంతో కీలక అవయవాల పనితీరుపై ప్రభావం పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. మాట్లాడలేని స్థితికి చేరుకున్న ఆయన, తన శరీర బరువులో దాదాపు 20 శాతం తగ్గిందని స్వయంగా వెల్లడించారు.

**హైకోర్టు జోక్యంతో ఆసుపత్రికి తరలింపు**

వాంగ్‌చుక్ ఆరోగ్య పరిస్థితిపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని విచారించిన ఢిల్లీ హైకోర్టు, ప్రతి పౌరుడి ప్రాణం విలువైనదేనని పేర్కొంటూ ఆయనకు ప్రతిరోజు వైద్య పరీక్షలు నిర్వహించాలని అధికారులను ఆదేశించింది. అవసరమైతే తక్షణ వైద్య సహాయం అందించాలని కూడా స్పష్టం చేసింది. రాజకీయ నాయకులు, పౌరసంఘాలు దీక్ష విరమించాలని కోరినా, విద్యార్థులకు న్యాయం జరిగే వరకు వెనక్కి తగ్గేది లేదని వాంగ్‌చుక్ స్పష్టం చేశారు. అయితే ఆరోగ్యం మరింత క్షీణించి ప్రాణాపాయం ఏర్పడే అవకాశం ఉందన్న వైద్యుల హెచ్చరికలు, హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో పోలీసులు ఆయనను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

## 'బుల్లెట్ ట్రైన్' భూమికి కంచె వేస్తున్న హైడ్రా



### ⏭ అడ్డుకున్న రైతులు బహదూర్‌గూడలో తీవ్ర ఉద్రిక్తత

**టీ మీడియా, జులై 18 , శంషాబాద్ :**
బుల్లెట్ రైల్ ప్రాజెక్టు భూ సేకరణ వ్యతిరేకంగా రైతులు నిరసనబాట పట్టారు. శంషాబాద్ మండలంలోని బహదూర్ గూడలో 650 ఎకరాల ప్రభుత్వ భూమికి కంచె వేసేందుకు వచ్చిన హైడ్రా, రెవెన్యూ అధికారులను రైతులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ప్రభుత్వం నుంచి పరిహారం ఇప్పించాలంటూ ఆర్డీవో శ్రీధర్‌తో రైతులు వాగ్వాదానికి దిగారు. గ్రామస్థులు, రైతులు నిరసనతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఆందోళనకారులను నియంత్రించేందుకు గ్రామంలో భారీగా పోలీసులు మోహరించారు.

**నేతలను అడ్డుకున్న పోలీసులు**
గ్రామస్థులు, రైతులకు బీజేపీ, బీఆర్ఎస్ సంఘీభావం ప్రకటించాయి. బహదూర్ గూడలో బీఆర్?ఎస్? నేత కార్తీక్ రెడ్డిని పోలీసులు అడ్డుకొని నందిగామ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు తోకల శ్రీనివాస్‌రెడ్డిని గృహనిర్బంధం చేశారు. ఈ క్రమంలో బీజేపీ నేతలు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో శ్రీనివాస్ రెడ్డితో పాటు బీజేపీ కార్యకర్తలను కంచన్ బాగ్ పోలీస్ స్టేషన్?కు తరలించారు.

**మూడు కారిడార్లు ఇక్కడే నిర్మాణం**
కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ఏడు బుల్లెట్ రైళ్లలో మూడు మార్గాలు ఒక్క తెలంగాణలోనే ఏర్పాటవుతున్నాయి. ఇదే విషయాన్ని ఇటీవల రాష్ట్రంలో పర్యటించిన రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించడంతో నగర శివారుల్లో బుల్లెట్ ట్రైన్ అందుబాటులోకి రానుందనే దానికి మరింత బలం చేకూరింది. శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలోని బహదూర్‌గూడ వద్ద బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు కోసం ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం 650 ఎకరాల భూమిని కేటాయించింది. ఇక్కడినుంచే మూడు బుల్లెట్ ట్రైన్ కారిడార్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే శంషాబాద్-ముంబయి, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-అమరావతి-చెన్నై కారిడార్లను ఏర్పాటు చేయనున్నారు.

**పొలాల మీదుగా బుల్లెట్ ట్రైన్**
ఇందులో ముంబయి మార్గానికి సంబంధించి బహదూర్‌గూడ వద్ద మొదలై మొయినాబాద్, చేవెళ్ల, వికారాబాద్ మీదుగా బుల్లెట్ ట్రైన్ కారిడార్‌ను నిర్మించతలపెట్టారు. సంబంధించి రైల్వే యంత్రాంగం వేగంగా భూసేకరణకు మార్కింగ్ చేస్తున్నారు. శంషాబాద్ మండలంలోని చౌదరిగూడ, కేబీదొడ్డి, సుల్తాన్‌పల్లి గ్రామాలతో పాటు మొయినాబాద్ మండలంలోని సురంగల్, కేతిరెడ్డిపల్లి, అమ్డాపూర్ జంక్షన్?లలో మార్కింగ్‌లు వేశారు. ఎలాంటి మూలమలుపులు లేకుండా ప్రతి 5 కిలో మీటర్లకు ఒక చోట మార్కింగ్ పెడుతున్నారు. ఈ మార్కింగ్‌లు పచ్చటి పంట పొలాల మధ్య నుంచే వెళుతుండటంతో రైతులు తమ భూములు కోల్పోతామని ఆందోళన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ పోయే భూములకైనా సరైన నష్టపరిహారం ఇప్పించాలని కోరుతున్నారు.

## అక్రమ సొమ్మంతా బినామీ పేర్ల మీదే!

### ⏭ వారి లెక్కలూ తేల్చనున్న ఆదాయ పన్ను శాఖ!




**టీ మీడియా, జులై 18 , హైదరాబాద్ బ్యూరో :**
అవినీతి అధికారుల రూ.వందల కోట్ల విలువైన అక్రమాస్తుల చిట్టాలు ఇటీవల ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయి. ఏ అధికారి వద్ద చూసినా కళ్లు చెదిరేలా నగలు, నగదు, లెక్కలేనన్ని ఫ్లాట్లు, ఎకరాల కొద్దీ వ్యవసాయ భూములు, పక్క రాష్ట్రాల్లో ఆస్తులు వెలుగు చూస్తున్నాయి. అధికారాన్ని అడ్డం పెట్టుకొని కొందరు అక్రమార్కులు పోగేస్తున్న సంపద లెక్కకు మిక్కిలిగా ఉంటోంది. ఇలాంటి వారి అంతు చూడటానికి ఆదాయపు పన్ను శాఖ రంగంలోకి దిగింది.ప్రస్తుతం అవినీతిపరుల గుండెల్లో దడ పుట్టిస్తున్న అవినీతి నిరోధక శాఖతో కలిసి అస్త్రాలు సిద్ధం చేస్తోంది. ముఖ్యంగా అక్రమ సొమ్మును బినామీల పేర్ల మీద పెడుతున్న అవినీతి అధికారుల అక్రమార్జనను గుర్తించి, జప్తు చేసేందుకు బినామీ లావాదేవీల నిరోధక విభాగం తీవ్రంగా కసరత్తు చేస్తోంది. బినామీ ఆస్తుల లావాదేవీల నిరోధక చట్టం-1988తో బినామీల గుట్టు రట్టు చేయనుంది. దీనికి సంబంధించి అవినీతి నిరోధక శాఖ అధికారుల నుంచి వివరాలు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది.

**ఆస్తులన్నీ బినామీల పేర్ల మీదే**
ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏ అధికారి ఇంట్లో సోదాలు చేసినా, మార్కెట్? ధరల ప్రకారం రూ.వందల కోట్ల ఆస్తులు వెలుగు చూస్తున్న సంగతి తెలిసిందే. ఇటీవల దొరికిన డీఎస్పీ భీంరెడ్డి ఆస్తుల విలువ మార్కెట్? ధరల ప్రకారం కనీసం రూ.200 కోట్లు ఉంటుందని అంచనా. కర్ణాటకలో ఒక దగ్గర 38, మరో దగ్గర 6 ఎకరాల భూమి కొనుగోలు చేసిన హోంగార్డు అతని బినామీ అని గుర్తించారు. ఇలాంటి బినామీలు 10 మంది వరకు ఉన్నట్లు దర్యాప్తులో తేలింది. ఈయనొక్కడే కాదు, పట్టుబడుతున్న వారిలో అత్యధికులు తమ ఆస్తులను బినామీల పేర్ల మీద బదలాయిస్తున్నారు.వారు విధుల్లో ఉన్నప్పుడు తమ పేర్ల మీద ఆస్తులు కొనుగోలు చేయాలంటే అధికారిక అనుమతులు తీసుకోవాలి. అలా చేస్తే వారి బండారం బయటపడుతుండటంతో బినామీలను పెట్టుకుంటున్నారు. అవినీతి నిరోధక చట్టం ప్రకారం కేసు దర్యాప్తు చేసే అధికారులు బినామీల జోలికి వెళ్లరు. వారి వాంగ్మూలం నమోదు చేసి, న్యాయస్థానానికి తెలియజేస్తారు. దీంతో అక్రమార్కులకు తేలికగా తప్పించుకునే అవకాశం ఉంది.

**ఏడాదికి 60-70 కేసులు**
బినామీ ఆస్తుల లావాదేవీల నిరోధక చట్టం ఇలాంటి బినామీలను గుర్తించి, వారి పేర్ల మీద ఉన్న ఆస్తులను కూడా జప్తు చేసే అధికారం ఆదాయపు పన్ను శాఖకు కట్టబెట్టింది. దీనికోసం ప్రత్యేకంగా బినామీ లావాదేవీల నిరోధక విభాగం ఏర్పాటు చేశారు. హైదరాబాద్? విభాగంలో ఏడాదికి 60 నుంచి 70 కేసులు నమోదవుతున్నాయి.

**కేసు వివరాలు తెప్పించుకుంటున్న అవినీతి నిరోధకశాఖ**
ఉదాహరణకు కరడుగట్టిన నేరగాడు నయీం బెదిరించి రాయించుకున్న ఆస్తులను తన కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల పేర్ల మీద పెట్టాడు. నయీం నేరాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టినప్పుడు బినామీల గుట్టు రట్టు చేసే పని ఆదాయ పన్ను శాఖ తీసుకుంది. బినామీలుగా గుర్తించిన వారికి నోటీసులు పంపి ఆస్తులు జప్తు చేసింది. ఇప్పుడు అవినీతి నిరోధక శాఖ నమోదు చేస్తున్న ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో నిందితులపై కూడా బినామీ ఆస్తుల నిరోధక చట్టాన్ని ప్రయోగించేందుకు సిద్ధమవుతోంది. దీనికి సంబంధించి అవినీతి నిరోధక శాఖ నమోదు చేసిన కేసు వివరాలు తెప్పించుకుంటోంది.

## సీమైన్లు ఢీకొని చమురు ట్యాంకర్లు పేలాయని ఇరాన్ ప్రకటన



### ⏭ ఖండించిన అమెరికా

**టీ మీడియా, జులై 18 , ఢిల్లీ బ్యూరో :**
హర్మూజ్‌లో ప్రయాణించేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో, "సీమైన్ల" పేలుళ్ల కారణంగా రెండు చమురు ట్యాంకర్లు తీవ్రంగా దెబ్బతిన్నాయని ఇరాన్ చేసిన ప్రకటనను అమెరికా సెంట్రల్ కమాండ్ కొట్టిపారేసింది. ఇరాన్ ప్రకటనలో ఎలాంటి నిజం లేదని అమెరికా సైన్యం స్పష్టం చేసింది. ఈ మేరకు ఎక్స్ మాధ్యమంలో ఓ పోస్ట్ చేసింది. హర్మూజ్ జలసంధిలోని మైన్‌ఫీల్డ్ ప్రాంతంలో రెండు చమురు ట్యాంకర్లు, సీమైన్లను ఢీకొని పేలిపోయాయని, వాటిలో భారీగా మంటలు చెలరేగాయని ఐఆర్?జీసీ ఇంతకుముందు ప్రకటించింది. అమెరికా నిఘా సంస్థలు మోసపూరితంగా ఆ నౌకలను ఆ మార్గం నుంచి పంపేందుకు ప్రయత్నించినప్పుడు ఈ ప్రమాదం జరిగిందని పేర్కొంది. దీనిపై అమెరికా సెంట్రల్ కమాండ్ స్పష్టతనిచ్చింది.

**'పూర్తిస్థాయి దాడి' హెచ్చరిక**
ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా ఖమేనీ సీనియర్ సైనిక సలహాదారు మొహ్సెన్ రెజాయీ కూడా అమెరికాపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అమెరికా మరో రెండు నుంచి మూడు రోజుల్లో కూడా యుద్ధాన్ని కొనసాగిస్తే, ఇరాన్ ప్రతీకార దాడులతో సరిపెట్టకుండా పూర్తి స్థాయి దాడికి దిగుతుందని హెచ్చరించారు. ఇకపై రాజకీయ సరిహద్దులు కూడా తమ దాడులను అడ్డుకోలేవని ఆయన పేర్కొన్నారు. చర్చలు, దౌత్య ప్రయత్నాల దశ ముగిసిందని, పరిస్థితులు మరింత తీవ్రరూపం దాల్చే అవకాశముందని హెచ్చరించారు.

**అమెరికాకు వార్నింగ్**
ఇదిలా ఉండగా అమెరికా సైనిక స్థావరాలకు ఆతిథ్యం ఇస్తున్న దేశాలకు ఐఆర్‌జీసీ తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. అమెరికా బలగాలకు తమ భూభాగాన్ని వినియోగించుకునే అవకాశం కల్పిస్తున్న దేశాలు తగిన ప్రతిస్పందనకు సిద్ధంగా ఉండాలని పేర్కొంది. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో అమెరికా దాడులకు వేదికగా తమ భూభాగాన్ని ఉపయోగించుకునేందుకు అనుమతిస్తున్న దేశాలు వెంటనే తమ పౌర రక్షణ వ్యవస్థలను అప్రమత్తం చేయాలని పేర్కొంది. సైనిక లక్ష్యాలకు సమీపంలో ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించింది.

**కువైట్‌లోని అమెరికా స్థావరాలపై దాడుల ప్రకటన**
కువైట్‌లోని క్యాంప్ అరిఫ్జాన్‌లో ఉన్న అమెరికా సైనిక లాజిస్టిక్స్ కేంద్రాన్ని డ్రోన్లు, క్షిపణులతో లక్ష్యంగా చేసుకున్నామని ఐఆర్‌జీసీ ప్రకటించింది. ఈ దాడిలో అక్కడ ఉన్న అమెరికా సైనిక సిబ్బందికి నష్టం వాటిల్లిందని పేర్కొంది. అలాగే కువైట్‌లోని అలీ అల్ సలేం ఎయిర్‌బేస్‌పై కూడా దాడి నిర్వహించినట్లు వెల్లడించింది. ఈ దాడిలో రాడార్ వ్యవస్థలు, ఆయుధాల నిర్వహణ హ్యాంగర్, డ్రోన్ కేంద్రం ధ్వంసమైనట్లు ఇరాన్ వర్గాలు ప్రకటించాయి. అయితే ఈ వాదనలపై అమెరికా నుంచి అధికారిక ధ్రువీకరణ వెలువడలేదు. ఈ దాడుల నేపథ్యంలో కువైట్ విమాన కార్యకలాపాలను నిలిపివేసింది.

## పోలవరం జిల్లాలో విషాదం

### ⏭ గోదావరిలో చేపల వేటకు వెళ్లి ఐదుగురు మృతి



**టీ మీడియా, జులై 18 , పోలవరం :**
రాష్ట్రంలో ఇటీవల చేపల వేటకు వెళ్లి గలంతైన ఘటనలు కలవర పరుస్తున్నాయి. జులై 4న విశాఖ తీరానికి సమీపంలో మత్స్యకారుల పడవ బోల్తా పడి ఒకరు ప్రాణాలతో బయటపడగా మరో ఆరుగురి ఆచూకీ లభించలేదు. తాజాగా ఇవాళ ఓ ఐదుగురు చేపల వేటకు వెళ్లారు. అప్పటికి వరకు అంత సజావుగానే సాగింది. ఈ క్రమంలోనే లోతు ఎక్కువగా ప్రాంతానికి వెళ్లి ప్రమాదవశాత్తు గల్లంతై మృతి చెందారు. ఈ విషాద ఘటన పోలవరం జిల్లాలో చోటు చేసుకుంది.ఇందుకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఎటపాక మండలం గొల్లగూడెం వద్ద గోదావరి నదిలో చేపల వేటకు వెళ్లి గల్లంతై ఐదుగురు మృతి చెందారు. మృతుల్లో ముగ్గురు మహిళలు, ఇద్దరు పురుషులు ఉన్నారు. నదిలో చేపల వేటకు వెళ్లిన క్రమంలో లోతు ఎక్కువగా ఉన్న ప్రాంతంలో దిగడంతో ఈ ఘటన చోటు చేసుకుంది. దీనిపై సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు.

ఈ క్రమంలోనే ఐదుగురు మృతదేహాలను వెలికి తీశారు. మృతులు గొమ్ముకొత్తగూడెంకు చెందిన ఊకె సుశీల (37), ఊకె లక్ష్మి (37), తుర్రం భారతి (40), భాసుబోయిన బాలరాజు (38), ఊకె రమేశ్?గా? (38) గుర్తించారు. మృతదేహాలను పోస్ట్?మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మరోవైపు విగత జీవులుగా పడి ఉన్న తమవారిని చూసి కుటుంబ సభ్యులు, బంధువులు రోదించిన తీరు అక్కడి వారిని కలిచివేసింది. ఒకే గ్రామానికి చెందిన ఐదుగురు మృతి చెందటంతో గొమ్ముకొత్తగూడెంలో విషాదఛాయలు అలముకున్నాయి.గోదావరిలో చేపల వేటకు వెళ్లి ఐదుగురు గల్లంతుపై మంత్రి సంధ్యారాణి ఆరా తీశారు. జిల్లా ఉన్నతాధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఐదుగురు గిరిజనులు మృతి చెందినట్లు అధికారులు మంత్రికి వివరించారు. మృతుల కుటుంబాలకు మంత్రి సంధ్యారాణి ప్రగాఢ సానుభూతి తెలిపారు. స్థానిక ఎమ్మెల్యేతోనూ మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు.

## బోనాల షాపింగ్ అంతా ఆన్‌లైన్‌లోనే

### ⏭ బోనం కుండల నుంచి చీరల వరకు ప్రతీదీ హోమ్ డెలివరీ



**టీ మీడియా, జులై 18 , హైదరాబాద్ బ్యూరో :**
ఆషాడ మాసం రాకతో భాగ్యనగరం ఆధ్యాత్మిక శోభతో వెలిగిపోతుంది. తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బోనాల పండుగ సందర్భంగా అమ్మవారికి సమర్పించే సంప్రదాయ నైవేద్యాలు, బోనం కుండలు, పట్టు వస్త్రాలు కొనుగోలు చేసేందుకు హైదరాబాద్ నగరంలోని మార్కెట్లన్నీ సందడిగా మారాయి. డిజిటల్ యుగంలో మారుతున్న కాలానికి అనుగుణంగా నగరవాసులు ఆన్‌లైన్ ఫ్లాట్?ఫారాల ద్వారా వస్తువులను ఆర్డర్ చేసుకుంటున్నారు. ఈ-కామర్స్, క్విక్-కామర్స్ విస్తరణ పండుగ సామగ్రి కొనుగోలు విధానాన్ని పూర్తిగా మార్చివేసింది.

**కుండల నుంచి చీరల వరకు ఆన్‌లైన్‌లోనే**
లాల్ దర్వాజ, మోండా మార్కెట్, బేగంబజార్ మార్కెట్లకు వెళ్లే సమయం లేని వారు ఈ-కామర్స్ సైట్‌లు, క్విక్ కామర్స్ యాప్‌ల ద్వారా కావాల్సిన సామగ్రి తెప్పించుకుంటున్నారు. కుండల నుంచి చీరల వరకు అన్నీ ఆన్‌లైన్‌లోనే లభిస్తుండటంతో ఇటువైపు మొగ్గు చూపుతున్నారు. బోనాల పండుగలో అత్యంత ముఖ్యమైంది అమ్మవారికి సమర్పించే బోనం కుండ. ప్రస్తుతం మట్టి కుండలతో పాటు జీవితాంతం వాడకానికి వీలయ్యే లోహపు కుండలు ఆన్?లైన్?లో ట్రెండ్ అవుతున్నాయి. 1 లీటరు నుంచి 4 లీటర్ల సామర్థ్యం కలిగిన, విభిన్న డిజైన్లతో కూడిన ఇత్తడి బోనం ఘటాలను వ్యాపారులు డెలివరీ చేస్తున్నారు.

**హోమ్ డెలివరీలో వెండి బోనం ఘటాలు**
సికింద్రాబాద్ పాట్‌మార్కెట్‌కు చెందిన దుకాణాల నిర్వాహకులు కూడా సోషల్ మీడియాలో, ఆన్‌లైన్ ఆర్డర్ల ద్వారా వెండి బోనం ఘటాలను హోమ్ డెలివరీ చేస్తున్నారు. ఇంతే కాకుండా పసుపు, కుంకుమ, కర్పూరం, అగర్ బత్తీలు, తోరణాలు ఇలా ప్రతి ఒక్క వస్తువు కోసం తిరిగే పని లేకుండా 'అల్ ఇన్ వన్' కిట్లను కొనుగోలు చేస్తున్నారు. బోనాల ఊరేగింపులో పాల్గొనే మహిళలు సంప్రదాయ పట్టు చీరలు ధరించడానికి ఇష్టపడతారు. ఈ క్రమంలో ఆన్?లైన్? స్టోర్‌లు, డిజిటల్ వేదికల్లో ప్రత్యేక ఆఫర్లు ప్రకటిస్తున్నారు. ఇన్‌స్టాగ్రామ్ పేజీలు, వెబ్‌సైట్లలో బోనాలు స్పెషల్ "పట్టు సిల్క్ శారీస్" పేరుతో ప్రకటనలు వేస్తున్నారు.

**ఎంతో మందికి ఉపాధి అవకాశం**
మరోవైపు పల్లెల్లో బోనాల సందడి మొదలైంది. డప్పుచప్పుళ్లు, పోతురాజు విన్యాసాలు, ఇంటికొచ్చే బంధువులు, ఆడపడుచుల సందడితో పల్లెలు, పట్టణాలు మార్మోగుతున్నాయి. సంస్కృతి, సంప్రదాయాలను కొనసాగించడమే కాకుండా సామాజిక, ఆర్థికంగా బోనాల పండుగ చాలా మందికి ఉపాధి కల్పిస్తోంది. బోనం వండి దేవతకు సమర్పించేందుకు డప్పుచప్పుళ్ల మధ్య శోభయాత్రగా వెళ్తుంటారు. 4 నుంచి 10 మంది బృందంగా ఉండే డప్పు కళాకారులకు ఉపాధి వస్తోంది. డీజేలకు, ఆలయాల చుట్టూ ఎల్?ఈడీ విద్యుత్? దీపాల అలంకరణకు నిర్వాహకులు రూ.వేలల్లో ఖర్చు చేస్తారు. బోనం కుండకు పూలు, వేప కొమ్మలు, మామిడి ఆకుల అలంకరణకు పట్టణాల్లో భలే గిరాకీ ఉంటుంది.

**మేకలు, గొర్రెలకు భలే గిరాకీ**
గ్రామ దేవతలకు బోనం సమర్పించడంతో పాటు గొర్రెలు, మేకలు, కోళ్లను కూడా బలిస్తారు. పెంపకందారులు, వ్యాపారులకు మంచి ఆదాయం వస్తోంది. మేక సైజు, బరువును బట్టి రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు విక్రయిస్తారు. నెల రోజుల్లో వ్యాపారులకు రూ.లక్షకు పైగా గిట్టుబాటు అవుతోంది. బంధువులు, ఆడపడుచుల రాకపోకల సందర్భంగా పండ్ల వ్యాపారులకూ గిరాకీ రానుంది. మరోవైపు బస్సులతో ఆర్టీసీకి, బోనాల అనంతరం వనమాసం సందర్భంగా మద్యానికి డిమాండ్? పెరగడంతో ప్రభుత్వానికి ఆదాయం మరింత సమకూరనుంది.

**మట్టి కుండల తయారీ**
అమ్మవారికి నైవేద్యం సమర్పించే కుండతో పాటు దానిపై ఉండే మూత చాలా అవసరం. కుమ్మరులు వీటిని ముందుగానే తయారు చేసి సిద్ధంగా ఉంచుతారు. కుండ, మట్టి మూత రూ.100 నుంచి రూ.300 (రంగులు వేసిన కుండ) వరకు విక్రయిస్తున్నారు. బోనాల పండుగ నెల రోజుల్లో తయారీ చేసే కుటుంబాలకు రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు ఆదాయం వస్తోంది.

## నగరం నడిబొడ్డున 'చెత్త' కొండలు

### ⏭ కరిగించడానికి రూ.100 కోట్లు!



**టీ మీడియా, జులై 18 , హైదరాబాద్ బ్యూరో :**
హైదరాబాద్‌లో ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ అనగానే గుర్తొచ్చేది ఆకాశాన్ని తాకే బహుళ అంతస్తుల భవనాలు, ఐటీ కంపెనీలు, కార్పొరేట్? కార్యాలయాలు, ఫైవ్?స్టార్ హోటళ్లు, ఎప్పుడూ రద్దీగా ఉండే రహదారులు. ఇది నాణేనికి ఒక వైపు మాత్రమే. మరోవైపు పరిస్థితి భిన్నంగా ఉంటుంది. ఎత్తైన భవనాల మధ్య నిర్మాణ వ్యర్థాల (సీ అండ్ డీ) కొండలు తయారవుతున్నాయి. ఇప్పటికే రెండు చోట్ల భారీగా వెలిశాయి. ఈ కొండలను తొలగించడానికి రూ.100 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా.

**వ్యర్థాలతో భారీ కొండలు**
ఐటీ కారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్?లో 30 నుంచి 50 అంతస్తుల భారీ భవనాలు నిర్మిస్తున్నారు. వీటి నుంచి వెలువడుతున్న నిర్మాణ వ్యర్థాల నిర్వహణ సవాల్?గా మారింది. నిర్మాణదారులు వీటిని ప్రభుత్వ భూముల్లో గుట్టలుగా పారబోస్తున్నారు. దీంతో హైటెక్? సిటీ నుంచి ఖానామెట్? వెళ్లే దారిలో రెండు భారీ కొండలు ఏర్పడ్డాయి. గచ్చిబౌలిలోని సర్వే నంబరు 44లో 10 ఎకరాలు, కొండాపూర్‌లోని సర్వే నంబరు 59లో 30 ఎకరాల ప్రభుత్వ భూములున్నాయి. వీటిపై ప్రైవేటు పట్టాదారులు, ప్రభుత్వం మధ్య న్యాయ వివాదం నడుస్తోంది. దీని ఫలితంగా భూములపై ఎలాంటి పర్యవేక్షణ లేకుండా పోయింది. దీనిని అవకాశంగా తీసుకుని నిర్మాణదారులు నిర్మాణ వ్యర్థాలను ఇక్కడ డంప్ చేస్తున్నారు. ఇలా రెండు ప్రాంతాల్లో 15 టన్నుల చొప్పున మొత్తం 30 లక్షల టన్నులు పేరుకుపోయాయి.

**దరఖాస్తు చేసుకోకుండానే పారేస్తున్నారు**
సాధారణంగా 200 గజాల స్థలంలో మూడంతస్తుల భవనాన్ని కడితే, కనీసం 100 టన్నుల నిర్మాణ వ్యర్థాలు వెలువడుతాయి. ఇందులో రాళ్లు, మట్టి, ఇసుక, ఇటుక, కాంక్రీట్? మిశ్రమం, ప్లాస్టిక్, ప్లైవుడ్? మొదలైనవి ఉంటాయి. వీటిని తరలించడానికి నిర్మాణదారులు నగరపాలక సంస్థలకు అప్లై చేసుకోవాలి. అప్పుడు రాంకీ సంస్థ జీడిమెట్ల, ఫతుల్లాగూడలకు తీసుకెళ్లి, అక్కడ వేరు చేసి డంపింగ్ యార్డుకు పంపిస్తుంది. ఎస్?ఎస్ఆర్ అనే మరో కంపెనీ శంషాబాద్?కు వ్యర్థాలను తరలించి అక్కడ వేరు చేస్తుంది. ఒక టన్ను వ్యర్థాలకు రూ.500 వసూలు చేస్తారు. కానీ చాలా మంది నగరపాలక సంస్థలను ఆశ్రయించకుండానే ప్రభుత్వ స్థలాల్లో పారవేస్తున్నారు. ఈ వ్యర్థాల కొండల ప్రాంతంలో ఎప్పుడైనా క్లౌడ్? బరస్ట్? సంభవిస్తే జరిగే ప్రమాదాన్ని ఊహించలేం. మట్టి, దుమ్ము నీటిలో కరిగిపోయి చుట్టుపక్కల ప్రాంతమంతా బురదగా మారతాయి. బహుళ అంతస్థుల సెల్లార్లలోకి ఈ బురద వెళ్లే ముప్పు ఉంది.

**నగర పాలక సంస్థపైన అదనపు భారం**
టన్నుకు రూ.500 చొప్పున చెల్లించితే 30 లక్షల టన్నుల వ్యర్థాలను తరలించడానికి రూ.150 కోట్లు అవుతుంది. సీఎంసీ కమిషనర్? జి.సృజన నిర్మాణ వ్యర్థాలపై అధ్యయనం చేయించారు. తరలింపు బాధ్యతను గుత్తేదారులకు అప్పగిస్తే రూ.100 కోట్ల వరకు అవుతుందని అంచనా వేస్తున్నారు. ఇటీవల గుత్తేదారుల నుంచి ఆసక్తి వ్యక్తీకరణ బిడ్లు ఆహ్వానించారు. అయితే ప్రైవేటు వ్యక్తులకు అవకాశమిస్తే వెంచర్లను చదును చేయడానికి చాలా వరకు వినియోగిస్తారని రియల్ కంపెనీలు చెబుతున్నాయి.ఈ రెండు చోట్లే కాకుండా తమ్మిడికుంట, ఈదులకుంట, ఖానామెట్?లలోనూ నిర్మాణ వ్యర్థాలను పారబోస్తున్నారు. వాటిని రాత్రి దహనం చేయడం వల్ల ఘాటైన పొగలు కమ్ముకుంటున్నాయి.వ్యర్థాలను తొలగించడానికి కొన్ని వందల ట్రిప్పుల లారీలు తిరగాల్సి ఉంది. దీనివల్ల ట్రాఫిక్, కాలుష్యం సమస్యలు వీటికి తోడు రోడ్లు దెబ్బతింటాయని పలువురు విశ్లేషిస్తున్నారు.

## ప్రకాశం జిల్లాలో ఆర్టీసీ బస్సు బోల్తా

**టీ మీడియా, జులై 18, ప్రకాశం జిల్లా :**
ప్రకాశం జిల్లాలో 'పల్లె వెలుగు' బస్సు బోల్తా పడిన ఘటన కలకలం రేపింది. కొండపి--మద్దూరు మార్గంలో, ద్వారక సీఫుడ్స్ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. ప్రాథమిక సమాచారం ప్రకారం, ఎదురుగా వస్తున్న మరో బస్సును తప్పించబోయి నియంత్రణ కోల్పోవడంతో 'పల్లె వెలుగు' బస్సు బోల్తా పడింది. సింగల్ రోడ్డు కావడం, మూలమలుపు వద్ద దట్టంగా ముళ్ల చెట్లు ఎదగడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించడం లేదు. రాత్రి వర్షం కురవడం భూమి అంతా తడిగా ఉండడంతో మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న బస్సును తప్పించే క్రమంలో బ్రేక్ వేయగా పక్కకు జారి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో పలువురు ప్రయాణికులు గాయపడ్డారు. స్థానికుల సహాయంతో వారిని కొండపి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, ప్రస్తుతం అక్కడ చికిత్స పొందుతున్నారు.ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో సుమారు 60 మంది ప్రయాణికులు ఉన్నారని, వారిలో 20 మంది పాఠశాల విద్యార్థులు కూడా ఉన్నారు. అదృష్టవశాత్తూ, ప్రాథమిక నివేదికల ప్రకారం ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు.

# కాసులు కురిపిస్తున్న కోళ్ల వ్యర్థాలు

## ⏭|కూటమి నేతలకు నెలనెలా మామూళ్లు!

**టీ మీడియా, జులై 18 , అనకాపల్లి :**

అనకాపల్లి జిల్లాలో కోళ్ల వ్యర్థాలు కాసులు కురిపిస్తున్నాయి. కొంతమంది ముఠాగా ఏర్పడి మాంసం దుకాణాల నుంచి వ్యర్థాలను సేకరిస్తున్నారు. వాటిని చేపల చెరువులకు గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్నారు. వారాంతంలో సేకరించిన మొత్తాన్ని నిల్వ చేస్తున్నారు. రూ.లక్షల్లో వ్యాపారం జరుగుతుండగా, వచ్చిన సొమ్మును వాటాలుగా పంచుకుంటున్నారు. ఇందులో కూటమి నేతలకూ మాముళ్లు అందుతున్నాయి. దీంతో అధికారులు కన్నెత్తి చూడటం లేదు.



**కూటమి నేతల కనుసన్నల్లోనే**

కోళ్ల వ్యర్థాలను స్థానిక సంస్థలు సేకరించడం లేదు. ఆ పనిని చేపట్టేందుకు అనకాపల్లి, ఎలమంచిలి, నర్సీపట్నంలో కొంతమంది బృందంగా ఏర్పడ్డారు. వారికి కూటమికి చెందిన నేతల మద్దతు ఉంది. అనకాపల్లి పట్టణం, ఎలమంచిలి, పరవాడ ప్రాంతాల నుంచి భారీ మొత్తంలో వ్యర్థాలను సేకరిస్తున్నారు. ఇందులో అనకాపల్లి పట్టణానికి చెందిన ఓ నేత ప్రమేయం ఉండగా, సిండికేట్ నుంచి నెలకు రూ.10 లక్షల వరకు అందుతోంది. నర్సీపట్నం, ఎలమంచిలి, పరవాడ ప్రాంతాల్లో కూటమి నేతల కనుసన్నల్లోనే వ్యవహారం నడుస్తోంది.

**వేల కిలోల చికెన్ వ్యర్థాలు**

అనకాపల్లి జిల్లాలోని అనకాపల్లి జీవీఎంసీ, నర్సీపట్నం, ఎలమంచిలి మున్సిపాలిటీల్లో దాదాపు ప్రతి వీధిలోనూ ఒక చికెన్ దుకాణం ఉంది. కేవలం అనకాపల్లి పట్టణంలోనే ప్రతిరోజూ వేల కిలోల చికెన్ వినియోగం జరుగుతుందని అంచనా. వారాంతాల్లో రోజుల్లో లక్ష కిలోల పైమాటే. కిలో బరువున్న కోడిని కోస్తే, సుమారు 300 గ్రాముల వ్యర్థాలు వస్తాయి. దీనివల్ల రోజుకు సగటున 4,000 కిలోలకు పైగా వ్యర్థాలు వస్తున్నాయి. సెలవులు, పండగలు, ప్రత్యేక రోజుల్లో మరింత అధికం. వీటిని సేకరించేందుకు ప్రత్యేక బృందాలున్నాయి. వాటిని డ్రమ్ముల్లో నింపి, రాత్రి వేళల్లో చేపల చెరువులకు గుట్టు చప్పుడు కాకుండా తరలిస్తున్నారు. 100 కేజీల వ్యర్థాలను రూ.1,500 చొప్పున చేపల చెరువులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

**చేపల ఫీడ్ ధర కంటే వ్యర్థాలే తక్కువ**

చేపల పెంపకానికి వినియోగించే ఫీడ్ ధర ఎక్కువగా ఉంటుంది. ఎకరా చెరువులో చేప పిల్లల కోసం రెండు బ్యాగులు (100 కిలోలు) మేత అవసరం కాగా, పెద్ద సైజు చేపలకైతే 8 నుంచి 10 బ్యాగులు అవసరమవుతాయి. కోళ్ల వ్యర్థాల విషయానికొస్తే, ఎకరాకు 1.5 క్వింటాళ్లు 5 రోజుల పాటు సరిపోతుంది. చేపలకు వేసే ఫీడ్ ధరతో పోలిస్తే ఈ వ్యర్థాలు తక్కువ ధరకు లభిస్తున్నాయి. అలాగే ఇవి చేపల వృద్ధి వేగంగా ఉండటంతో చెరువుల నిర్వాహకులు కోళ్ల వ్యర్థాలకే ఆసక్తి చూపుతున్నారు.

**తనిఖీలు చేయని అధికారులు**

జిల్లా వ్యాప్తంగా సేకరించిన కోళ్ల వ్యర్థాల్లో అధికశాతం దేవరాపల్లి మండలంలోని చేపల చెరువులకే తరలిస్తున్నారు. ఇక కాకినాడ జిల్లాకు నక్కపల్లి, పాయకరావుపేటలోని వ్యర్థాలు వెళ్తున్నాయి. దేవరాపల్లిలో కోళ్ల వ్యర్థాలను చిన్న చిన్న ముక్కలుగా చేసేందుకు ప్రతి చేపల చెరువు వద్ద ప్రత్యేక యంత్రాలు ఉన్నాయి. తనిఖీలు చేయాల్సిన అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వల్ల పలు అనుమానాలకు తావిస్తోంది.

**ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నాం**

చేపలకు మేతగా కోళ్ల వ్యర్థాలను వినియోగించవద్దంటూ చెరువుల నిర్వాహకులకు ఇప్పటికే స్పష్టం చేసినట్లు అనకాపల్లి జిల్లా మత్స్యశాఖ అధికారి సిద్ధార్థ తెలిపారు. ఫీడ్ మాత్రమే ఆహారంగా అందించాలని సూచించారు. చెరువులను ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నామన్నారు. ఎవరైనా కోళ్ల వ్యర్థాలను వినియోగిస్తూ పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

# విద్యుత్ బిల్లుల మాఫీకి సర్పంచుల వినతి

**టీ మీడియా, జులై 18 పెబ్బేరు:**

వనపర్తి జిల్లా పెబ్బేరు మండల పరిధిలోని గ్రామపంచాయతీలపై పేరుకుపోయిన పెండింగ్ విద్యుత్ బిల్లులను వెంటనే మాఫీ చేయాలని డిమాండ్ గ్రామపంచాయతీల ఆర్థిక భారాన్ని తగ్గించి గ్రామాభివృద్ధి పనులు నిరంతరాయంగా కొనసాగేందుకు పెండింగ్ విద్యుత్ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మాఫీ చేయాలని కోరుతూ పెబ్బేరు మండల సర్పంచుల ఆధ్వర్యంలో మండల ఎంపీడీవో వెంకటేష్ కు ఎంపీఓ రోజా కు వినతిపత్రం అందజేయడం జరిగింది వినతిపత్రంలో పేర్కొన్న ముఖ్యాంశాలు గ్రామపంచాయతీలపై విద్యుత్ బిల్లుల భారం రోజురోజుకు పెరుగుతోంది ఆర్థిక ఇబ్బందుల కారణంగా అభివృద్ధి పనులు ప్రభావితమవుతున్నాయి



ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని పెండింగ్ విద్యుత్ బిల్లులను పూర్తిగా మాఫీ చేయాలి ఈ వినతిపత్రాన్ని సంబంధిత ఉన్నతాధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి పంపించి గ్రామపంచాయతీలకు న్యాయం చేయాలి ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామాల సర్పంచులు బునియాదిపురం వజగౌని విజయ్ గౌడ్ అయ్యవారిపల్లి అస్కానీ కురుమూర్తి బూడిదపాడు మన్యం గుమ్మడం నాగేష్ తిప్పాయిపల్లి రాముడు సుగూరు పరుశురాముడు తోమాలపల్లి అశోక్ కుమార్ పెబ్బేరు మండలంలోని ఇతర గ్రామాల సర్పంచులు గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ సమస్యను సానుకూలంగా పరిశీలించి పెండింగ్ విద్యుత్ బిల్లులను తక్షణమే మాఫీ చేయాలని సర్పంచులు విజ్ఞప్తి చేశారు

# హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



**టీ మీడియా, జులై 18 పెబ్బేరు:**

వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలో టి యు సి ఇ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రైస్ మిల్లులలో కరపత్రాలతో ప్రచారం నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా పెబ్బేరులోనీ కార్మికులను ఉద్దేశించి టి యు సి ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పి అరుణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రైస్ మిల్ డ్రైవర్లకు ఇతర మిల్లులో గోదాములలో పనిచేస్తున్న కార్మికులందరికీ కనీస వేతనం 26 వేల రూపాయలు అమలు చేయాలని డిమాండ్ చేశారు ఉదయం లేచినప్పటి నుంచి రాత్రి పండే వరకు ప్రతి మనిషి ఉపయోగించే ప్రతి వస్తువుని ట్రాన్స్ పోర్ట్ ద్వారా సప్లై అవుతుంది అంటే దాంట్లో హమాలీల శ్రమ దాగి ఉన్నది అలాంటి కార్మిక వర్గానికి భద్రతతో కూడిన సమగ్ర చట్టం తీసుకురావాలి సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు రైస్ మిల్లు దాల్ జిన్నింగుమిల్ స్పిన్నింగ్ మిల్లు ఆపరేటర్స్ మేస్త్రీలు గుమస్తాలు దినసరి కూలీలు పట్టి వాళ్ళకు చట్టాలు ఉన్న ఫ్యాక్టరీస్ యాక్ట్ ఉన్న వీరితోపాటు ప్రభుత్వ ప్రైవేటు సంస్థలలో పనిచేశారు హమాలీలకు పిఎఫ్ ఈఎస్ఐ గ్రాటివిటీ ఇన్సూరెన్స్ బోనస్ చట్టాలు కూడా అమలు కాని దుస్థితి నేడు ఉందన్నారు లేబర్ అధికారులు ప్రభుత్వ యంత్రాంగం పెట్టుబడిదారులకు దాసోహమై చట్టాలు అమలుకు నోచుకోలేదన్నారు వీటి ఫలితంగా కార్మిక వర్గానికి తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం నేడు కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని ఎద్దేవ చేశారు వివిధ రాష్ట్రాల నుంచి వలస వచ్చే పని చేస్తున్న కార్మిక వర్గానికి భద్రత రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు 1967 ఐ ఎల్ వో నిబంధనలను అమలు చేయాలని డిమాండ్ చేశారు రైస్ మిల్ డ్రైవర్లకు హమాలీలకు కనీస పెన్షన్ 9000 ఇవ్వాలన్నారు మిల్లులో ప్రమాదాలకు గురై చనిపోయిన కార్మిక వర్గానికి 10 లక్షల నష్టపరిహారం సహజ మరణానికి ఐదు లక్షల ఇవ్వాలని డిమాండ్ చేశారు ఇల్లులేని డ్రైవర్లకు హమలీలకు ఇతర కార్మికులకు ప్రభుత్వమే స్థలం ఇచ్చి డబల్ బెడ్ రూమ్ ఇల్లు కట్టి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు మహిళా కార్మికులకు ప్రసూతి సెలవులు అమలు చేయాలి ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై కార్మిక వర్గం నిరంతరం పోరాడుతూనే ఉండాలని కార్మిక వర్గాన్ని కోరారు. ఈనెల 25న వనపర్తి జిల్లా కేంద్రంలో జరిగే ధర్నాకు రైస్ మిల్లు డ్రైవర్లు మార్కెట్ రైస్ మిల్లు, బజారు గ్రామీణ హమాలీలు అధిక సంఖ్యలో రావాలని కోరారు ఈ ప్రచార కార్యక్రమం యూనియన్ రాష్ట్ర నాయకులు నంబి శ్రీనుపెబ్బేరు అధ్యక్షుడు వడ్ల శ్రీను ఉపాధ్యక్షులు అఫ్సర్ సహాయ కార్యదర్శి శేఖర్ రెడ్డి దేవన్న తదితరులు పాల్గొన్నారు

# బాల్య వివాహాలు చట్ట విరుద్ధం

## సి ఐ . గోపాలకృష్ణ..

**టీ.మీడియా.జూలై18.చింతూరు:**

బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని, నేరమని చింతూరు సిఐ గోపాలకృష్ణ పేర్కొన్నారు. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చింతూరు జూనియర్ కాలేజీలో శనివారం అంగన్వాడి కార్యకర్తలకు బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళలకు 18 సంవత్సరాలు, పురుషులకు 21 సంవత్సరాలు పూర్తి అయిన తర్వాతనే వివాహాలు జరపాలని పేర్కొన్నారు. చట్ట విరుద్ధంగా ఎవరైనా వివాహాలు జరిపితే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. మహిళ పోలీస్ స్టేషన్ సి ఐ కన్నపరాజు మాట్లాడుతూ బాల్యం లోనే బాలికలకు వివాహాలు చేయటం వల్ల అనేక వ్యాధులు వస్తాయని అన్నారు. ఎస్సై లతా శ్రీ మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఎవరైనా చట్టానికి లోబడి వివాహాలు జరపాల్సిందేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో, ఎస్సై సంతోష్ కుమార్, ఐసిడిఎస్ పిఓ జయలక్ష్మి, మండలంలోని అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.




# ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షునిగా ఏదిరే వెంకటేష్

**టీ మీడియా, జులై 18 ,ఆత్మకూరు :**

వనపర్తి జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష ఎన్నికలు శ్రీ శ్రీ వాసవి మాత కన్యకా పరమేశ్వరి దేవాలయంలో జరిగాయి. దాదాపు 500 మంది ఓటర్లు పాల్గొనగా నూతన ఆత్మకూరు పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా ఎదుర వెంకటేష్ ఎన్నికయ్యారు.



# గోదావరి జిల్లాలో విస్తారంగా వర్షాలు



## ⏭| పలు ప్రాంతాల్లో రహదారులు జలమయం

**టీ మీడియా, జులై 18 , తూర్పుగోదావరి :**

బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో తూర్పుగోదావరి జిల్లాలో తెల్లవారుజాము నుంచే విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షం కురుస్తోంది. వర్షాలతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడగా, రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. అయితే లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాజమహేంద్రవరం, అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, రాజానగరం, సీతానగరం, కోరుకొండ, గోకవరం, తదితర ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో రహదారులపై వర్షపు నీరు చేరి, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు గురువుతున్నారు. మరోవైపు ఈ వర్షాలతో వ్యవసాయానికి ఊరట లభించింది. వరి సాగుతో పాటు ఇతర పంటలకు తగిన తేమ అందడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**కేంద్రపాలిత ప్రాంతం యానాంలో వర్షం**

గడచిన రెండు వారాలలో కాకినాడ, రాజమండ్రి, అమలాపురం పరిసర ప్రాంతాలలో వర్షం కురిసింది. కానీ కేంద్రపాలిత ప్రాంతం యానాంలో మాత్రం చినుకు కూడా పడలేదు. జులై నెలలోనూ వేసవి కాలాన్ని తలపించేలాగా ఎండలు కాస్తున్నాయి. దానితో పాటు వడగాలుల ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ప్రస్తుతం కాస్తంత చినుకులు పడేసరికి జనం ఉపశమనం పొందుతున్నారు. బంగాళాఖాతం ఏర్పడిన అల్పపీడనం ప్రభావానికి ఉదయం నుంచి యానాంలో ఒక మోస్తరు వర్షాలు పడుతుండటంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, వివిధ పనులపై బయటికి వచ్చిన వారు రెయిన్ కోట్లు, గొడుకులు వేసుకుని చినుకుల్లో తడుస్తూ తన్మయత్వం చెందుతున్నారు.

కాకినాడ జిల్లాలోనూ ఉదయం నుంచి ఎడతెరిపిలేకుండా వర్షం కురుస్తోంది. కాకినాడలో వర్షాలకు రహదారులు అన్ని జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాలలో వర్షపు నీరు చేరింది. ఉదయం పాఠశాల, కళాశాల, ఉద్యోగాలకు వెళ్లే వారు ఇబ్బందులు పడ్డారు. ప్రధాన కూడల్లో వర్షపు నీరు చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

**రాజమహేంద్రవరంలో లోతట్టు ప్రాంతాలు జలమయం**


వేకువజాము నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షానికి నగరంలోని శ్యామల సెంటర్, రైల్వే స్టేషన్ రోడ్, కోటిపల్లి బస్టాండ్, కంబాలచెరువు, కృష్ణ నగర్, హైటెక్ బస్టాండ్, ఇన్‌కమ్ టాక్స్ ఆఫీసు రోడ్ తదితర లోతట్టు ప్రాంతాలన్నీ పూర్తిగా జలమయమయ్యాయి. నగరం మీదుగా విశాఖపట్నం వెళ్లే జాతీయ రహదారికి అనుసంధానం చేసే హైటెక్ బస్టాండ్ వద్ద భారీగా మురుగు నీరు చేరడంతో అటుగా ప్రయాణికులతో ఉన్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో నీరు చేరి మధ్యలో నిలిచిపోవడంతో ఆ కూడలిలో వాహనాల నిలిచి ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి పట్టణంలోని మిగిలిన ప్రాంతాల సైతం కాలువలు పొంగి రహదారులపై మురుగు నీరు చేరడంతో ఇళ్ల నుంచి బయటికి రాలేక నగరవాసులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. నగరపాలక సంస్థ వారు, పారిశుద్ధ్య కార్మికులు భారీ వర్షంలో సైతం కాలువల్లో పూడికలు తీస్తూ జనజీవనానికి ఆటంకం కలగకుండా శుభ్రం చేసే ప్రయత్నం చేస్తున్నారు.

# బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే మేఘన్న అండ

**టీ మీడియా, జులై 18 పెబ్బేరు:**

వనపర్తి జిల్లా పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డుకి చెందిన బొల్లి మహేష్ తండ్రి వెంకటయ్య అనారోగ్యంతో నిమ్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నాడు ఇంకా వైద్యానికి చేతిలో డబ్బులేక ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న బాధిత కుటుంబం విషయం తెలుసుకొన్న మున్సిపల్ వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి ఎమ్మెల్యే తూడి మేగారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు వెంటనే స్పందించిన ఎమ్మెల్యే బాధిత కుటుంబానికి ఒక లక్ష ఇరవై ఐదు వేల రూపాయల ఎల్ వో సి నీ మంజూరు చేయించారు దీంతో బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే కు మంజూరుకు సహకరించిన మున్సిపల్ వైస్ చైర్మన్ కు ఋణపడి వుంటామని ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు

# చర్ల పరమేశ్వరి స్వామి చెరువులో ఆక్రమణ



**టీ మీడియా ,జులై 18 ఆత్మకూరు:**

వనపర్తి జిల్లా, ఆత్మకూరు మండలంలోని ఖానాపూర్ శివారులో ఉన్న శ్రీ పరమేశ్వరి స్వామి చెరువు పరిధిలో ఆక్రమణ యత్నానికి సంబంధించిన వీడియోలు వెలుగులోకి వచ్చాయి. సర్వే నంబర్లు 46, 47 పరిధిలో చెరువు ఆయకట్టు ప్రాంతంలో ప్రభుత్వ అనుమతులు లేకుండానే రాళ్లు పోస్తున్న దృశ్యాలు స్థానికులు చిత్రీకరించారు. చెరువు ఖనాపురం వైపు దిగువ భాగంలో ఉన్న ఆయకట్టు భూమిని విస్తరించుకునేందుకు భారీగా రాళ్లు డంప్ చేస్తున్నట్లు వీడియోల్లో ఫోటోలో స్పష్టంగా కనిపిస్తున్నదని స్థానికులు చెబుతున్నారు. చెరువు నిల్వ ప్రాంతంలో రాళ్లు పోసి భూ భాగాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని గ్రామస్థులు, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, ఈ విషయంపై ఆత్మకూరు తహసీల్దార్‌కు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తున్నారు. అధికారులు "మైన్స్ శాఖకు సమాచారం ఇచ్చాం... వాళ్లే వచ్చి అడ్డుకోవాలి" అంటూ బాధ్యతను మరో శాఖపైకి మళ్లిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. శ్రీ పరమేశ్వరి స్వామి చెరువు ఆయకట్టు ప్రాంతం రైతులకు సాగునీటి ప్రధాన ఆధారం కావడంతో, ఇటువంటి ఆక్రమణలు కొనసాగితే భవిష్యత్తులో చెరువు నీటి నిల్వ సామర్థ్యం దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వ భూములు, చెరువులు , వాటి ఆయకట్టు ప్రాంతాల పరిరక్షణ బాధ్యత అధికారులపై ఉందని, వెంటనే జిల్లా కలెక్టర్, రెవెన్యూ, మైన్స్, ఇరిగేషన్ శాఖలు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి రాళ్లు పోస్తున్న పనులను నిలిపివేయాలని స్థానిక ప్రజలు, రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# గోరింటాకు ఫెస్టివల్ డే వేడుకలు




**టీ మీడియా, జులై 18, రామకృష్ణాపూర్:**

క్యాతనపల్లి మున్సిపాలిటీ రామకృష్ణాపూర్ లోని ఎస్ఆర్కె పాఠశాలలో శనివారం గోరింటాకు ఫెస్టివల్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ పెద్దపల్లి ఉప్పలయ్య మాట్లాడుతూ అరికాళ్ళు,అరి చేతులకు గోరింటాకు పెట్టుకోవడం వల్ల శరీరంలో ఉన్న అధిక వేడిని తగ్గిస్తుందని చెప్పారు. వర్షాకాలంలో వచ్చే చర్మ సమస్యలు,వెళ్ళమధ్య ఇన్ఫెక్షన్లను రాకుండా నిరోధిస్తుందన్నారు. అలాగే కీళ్ల నొప్పులు,తిమ్మిర్లు నియంత్రించడంలో గోరింటాకు ఆయుర్వేద ఔషధముల ఉపయోగపడుతుందని అన్నారు. ఈ వేడుకల్లో పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.